క్లుప్తంగా

ఆలయాల్లో కార్తికమాస పూజలు



బాపట్ల అర్బన్: బాపట్ల ఎస్ఎస్పీ అగ్రహారం గంగాపర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాస పూజలు బుధవారం నిర్వహించారు. సౌమ్య లింగేశ్వరునిగా స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు సూరేపల్లి విద్యార్థిని



సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఏ స్ఎం హైస్కూల్‌కు చెందిన బొర్రా గీతికాశ్రీ గురువారం నుంచి నరసరావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస శర్మ బుధవారం తెలిపారు. ఇటీవల గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గీతికాశ్రీ సత్తా చాటింది. ఈ సందర్భంగా హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రామంలోని బండ్లమ్మ దేవాలయం ఆవరణలో బుధవారం బాపట్ల జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వ్యవసాయ కాలక్రమ పట్టిక ప్రదర్శించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా గ్రామ భౌగోళిక స్వరూపం, కాలక్రమ పట్టిక తయారు చేసి రైతులకు వ్యవసాయ విధి విధానాలకు వివరించారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయ అవలంబించడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు శివనాగేశ్వరమ్మ ఉన్నారు.

నేడు అల్లూరులో వై ఏపీ నీడ్స్ జగన్

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు, అలకాపురం గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తెలిపారు. చందోలులోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్‌హుస్సేన్ ఉన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

పిట్టలవానిపాలెం: మండలం ఖాజీపాలెం కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాలలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతకు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు చేనేత కార్మికుల నిరసన

రేపల్లె రూరల్: చేనేత కార్మికుల మజూరీ పెంచాలని కోరుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు చేనేత కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు, చేనేత వృత్తుదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు సంక్షేమ బోర్డు ఆవిష్కరణ

భట్టిప్రోలు: మండలంలో పెదపులివర్రు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి నీలా ఉషారాణి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీదుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ పాల్గొంటారని చెప్పారు.

మినుము పంట పరిశీలన

భట్టిప్రోలు: మండలం ఓలేరు, కొళ్ళపాలెం, కన్నెగంటివారిపాలెంలలో మెట్ట పైరుగా పండిస్తున్న మినుము పంటలను బుధవారం వ్యవసాయ శాఖ బృందం పరిశీలించింది. ఏఓ గొల్లపోతు మీరయ్య మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంటలో పల్లాకు తెగులు అధికంగా కనిపిస్తుందని, దీని నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను గూర్చి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సహాయకులు కె.కవితశ్రీ పాల్గొన్నారు.

ప్రజలకు మేలు కోసం జగన్ మళ్లీ సీఎం కావాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి



యాజలి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

యాజలి(కర్లపాలెం): ప్రజలకు మేలు జరగాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. యాజలి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై వెల్‌ఫేర్ బోర్డు ఆవిష్కరించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలన్నా, మెరుగైన పరిపాలన కావాలన్నా వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. రైతుల కోసం విద్యార్థుల కోసం, మహిళ కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన వైఎస్ జగన్ ప్రజలందరికీ కావాలని కోన రఘుపతి కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నాదెండ్ల భానుప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి పరమానందకుమార్, మార్పు బెనర్జీ పాల్గొన్నారు.

పెదలంక సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్..

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదలంక సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో నవరత్నాల్లో భాగంగా 3 గ్రామాలైన పెదలంక, చింతమోటు, పెసర్లంకలకు డీబీటీ రూపేణా రూ.32.54 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందినట్లు ఈఓపీఆర్డీ, నోడల్ ఆఫీసర్ టి.ఊహారాణి, తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైఎస్సార్ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పంచాయతీ కార్యదర్శి బి.పుష్పలతలతో పాటు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, గుజ్జర్లమూడి రాజు పాల్గొన్నారు.



భట్టిప్రోలు మండలం పెదలంకలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు



కిష్కిందపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొల్లూరు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. మండలంలోని కిష్కిందపాలెం సచివాలయం వద్ద 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని కిష్కిందపాలెం, తోకలవారి పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పంపిణీ చేసిన రూ. 23.43 కోట్ల సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. తొలుత స్థానిక నాయకులతో కలసి వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి ప్రభుత్వ కార్యాక్రమాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి గుంటూరు నీలాంబ్రం, ఈఓపీఆర్డీ రవి బాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

రేపల్లె: ప్రజా సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని 1, 28 వార్డుల పరిధిలోని సచివాలయంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేసి పేదల ఆర్థిక భద్రత కల్పించినట్లు చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలతో మమేకమై అభివృద్ధి బాటలో పయనిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.



పెరవలి గ్రామంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కౌన్సిలర్‌లు కంతేటి నాగలక్ష్మి, కొలుసు సామ్రాజ్యం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి..

పెరవలి(వేమూరు): ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారులకు వివరించడం కోసం ప్రభుత్వం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామ సచివాలయంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, గ్రామ సర్పంచి దాది వెంకట లక్ష్మీరాజ్యం, నాయకులు దాది సుబ్బారావు, బొల్లిముంత ఏడుకొండలు, దాది రజనీ, దాసరి పోతురాజు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నిష్పక్షపాతంగా తయారు చేయాలి

తహసీల్దార్ మల్లికార్జునరావు



బీఎల్వో, బీఎల్ఏలకు సూచనలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు

రేపల్లె: ఓటరు మార్పులు, చేర్పులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ డి.మల్లికార్జునరావు అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో పట్టణంలోని బీఎల్ఏ, బీఎల్వోలకు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రకటించామన్నారు.
వీటిపై వచ్చిన అభ్యంతరాలను పూర్తిస్థాయిలో విచారించాలని చెప్పారు. డిసెంబర్ 9వ తేదీ వరకు మార్పులు చేర్పులు చేసుకునేందుకు అవకావం, నూతన ఓట్లు నమోదు చేసేందుకు సమయం ఉందన్నారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఓటర్ల నుంచి, ఆయా పార్టీల నుంచి అభ్యంతరాలు లేకుండా పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

ఘనంగా సుందరాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పదమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పదమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 15వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పదమటి సుందరకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అర్చనలు, పూజలు, అభిషేకాలు, ఆకు పూజ, హనుమత్ కల్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారికి పట్టు వస్త్రాలను సుందర్ కుమార్ దంపతులు సమర్పించారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

బాపట్ల: పేదలకు నిత్యావసరాలు అందజేయటం ఎంతో సంతోషంగా ఉందని గ్రీన్‌పీస్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రత్నం తెలిపారు. బాపట్ల మండలం నందిరాజుతోటలోని ఎస్సీ కాలనీలో పేదలకు సరుకులు, భోజనం ప్యాకెట్లును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తాలుచూరి సురేష్,నాగరాజు, లక్ష్మీనారాయణ, దానియేలు, అంకమ్మ పాల్గొన్నారు.

ములాయం సింగ్ సేవలు మరువలేనివి

బాపట్ల: బీసీల సంక్షేమానికి సమాజ్‌వాది పార్టీ నాయకుడు ములాయంసింగ్‌యాదవ్ విశేషంగా కృషి చేశారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ములాయం సింగ్ యాదవ్ జయంతి బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, మోర్ల చిన వెంకటేశ్వరరావు, చేజర్ల సతీష్, ఎల్.సాంబయ్య, ఎ.నటరాజన్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్లపాలెం: యూటీఎఫ్ కర్లపాలెం మండల అధ్యక్షుడిగా బీవీ శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంవీ రాజుపాలెం ఉర్దూ పాఠశాలలో యూటీఎఫ్ సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జె.డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా వైవీ నారాయణ, ఉపాధ్యక్షులుగా పి.ఉషాకిరణ్, ఎస్‌కే మక్బుల్ బాషా, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ అజయ్‌కుమార్, ఎన్.సుప్రియ, వి.రాఘవేంద్ర, సీపీఎస్ కమిటీ సభ్యులుగా బి.రాజేష్, కె.లక్ష్మీ తిరుపతమ్మ, విమలమ్మ, చెన్నమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు ఆర్.రమేష్, సీహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న యూటీఎఫ్ నూతన కార్యవర్గ సభ్యులు

అంగన్‌వాడీల సమ్మె నోటీసు అందజేత


అమృతలూరు(భట్టిప్రోలు): అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 8 నుంచి చేపట్టనున్న సమ్మె నోటీసులు సీడీపీఓ జి.విజయలక్ష్మికి బుధవారం అందజేశారు. అంగన్‌వాడీల న్యాయమైన పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ అమృతలూరు ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు బి.అగస్టీన్ కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్, యూనియన్ నాయకులు పి.బసవమ్మ, ఎం.కామేశ్వరి, ఆర్.విత్రి, సుజాత, పద్మావతి, విజయ పాల్గొన్నారు.



అమృతలూరు సీడీపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు


దోషులను కఠినంగా శిక్షించాలి

పిట్టలవానిపాలెం: మండలం భవనంవారిపాలెంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జగదీష్, మనోజ్ స్నేహితులు. జగదీష్ 2024 జనవరిలో అమెరికా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నాడు. గత కొంతకాలంగా వీరిద్దరు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. సోదరి విషయంలో వివాదంతో మనోజ్ స్నేహితులైన నాగార్జున రెడ్డి, నాగిరెడ్డి, రుద్రశేఖర్‌రెడ్డిలతో కలసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో జగదీష్‌ను దారుణంగా హత్య చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి జగదీష్ మృతదేహాన్ని స్వగ్రామమైన భవనంవారిపాలెం గ్రామానికి తీసుకువచ్చారు.అయితే జగదీష్ కుటుంబ సభ్యులు, నాయీబ్రాహ్మణ సంఘం జేఏసీ నాయకులు నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో ఆందోళనకు దిగారు. జగదీష్‌ను హత్యచేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. జగదీష్ సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రెడ్డిపాలెం, చందోలు జాతీయ రహదారిపై జగదీష్ మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేసేందుకు సన్నద్ధమయ్యారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంగటనలు జరగకుండా బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, పట్టణ సీఐ శ్రీనివాస్‌లు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు నరసింహారావు

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



కాలువలో పడిన కారు, బైక్

కొల్లూరు: కారు ఢీకొని ఓ యువకుడు గాయాల బారిన పడిన ఘటన కొల్లూరు సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రేపల్లె మండలం పేటేరుకు చెందిన విజయ్ ద్విచక్ర వాహనంపై తెనాలి వైపు వెళుతున్నాడు. కొల్లూరు నుంచి దోనేపూడి వైపు వెళుతున్న కారు అతి వేగంతో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం పైకి దూసుకువెళ్లింది. ప్రమాదం దాటికి ద్విచక్ర వాహనదారుడు వాహనంతోపాటు ఎగిరి రోడ్డు పక్కనున్న కాలువలో పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానికులు, కొల్లూరు పోలీసులు వైద్య సేవల నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. కారు కాల్వలో పల్టీ కొట్టడంతో అందులో ఉన్న నలుగురు వ్యక్తులను స్థానికులు బయటకు తీసుకురావడంతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

పాల ఉత్పత్తి రైతులకు ప్రాధాన్యం

మంత్రి మేరుగ నాగార్జున



పాల కేంద్రం సొసైటీ పాలక వర్గం సభ్యులను సన్మానిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

వలివేరు(వేమూరు): పాల ఉత్పత్తి రైతులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. చుండూరు మండలం వలివేరులో పాల కేంద్రం సొసైటీ పాలకవర్గాన్ని బుధవారం సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చొరవతో ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో పాల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఈమని శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎ.ఆదియ్య, ఉయ్యూరి ఉదయకిరణ్, సీహెచ్ దామెదర్ రెడ్డి, సీహెచ్ నాగిరెడ్డి, తమ్మా సందీప్ రెడ్డి, భుంపల్లి వెంకట నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దాట్ల సౌజన్య, వైఎస్సార్ సీపీ నాయకులు గాదె శివరామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుల గణన పారదర్శకంగా నిర్వహించాలి

తహసీల్దార్ వెంకటేశ్వర్లు



కులగణన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణనపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న కులగణనకు ప్రజలు, అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం గ్రామాల్లో నిర్వహించే కుల గణన సర్వే నిస్పక్షపాతంగా నిర్వహించబడుతుందన్నారు, సర్వే లో ఒక గ్రామ సచివాలయ ఉద్యోగితో పాటు ఆయా క్లస్టర్ వలంటీర్ కూడా సర్వేలో ఉండాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో మాత్రమే ఈ కుల గణన వివరాలు ఎటువంటి తప్పులు లేకుండా సక్రమంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మురళి పాల్గొన్నారు.

కుల గణన పకడ్బందీగా చేయాలి

కర్లపాలెం: ప్రభుత్వ ఆదేశాల మేరకు కుల గణన చేపట్టాలని తహసీల్దార్ కేశవ నారాయణరావు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం కుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎలీషాబాబు, డీటీ సలీమా పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి



ప్రసంగిస్తున్న కోటా వెంకటేశ్వరరెడ్డి తదితరులు

బాపట్ల అర్బన్: ప్రజల్లో ఊరూరా జన విజ్ఞానంతో శాస్త్రీయ ఆలోచనలు పెంచాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోటా వెంకటేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఘంటసాల చైతన్య వేదిక, ఝాన్సీ రాణి కళావేదిక, ప్రజాస్వామ్య ఐక్య వేదిక, సోదర సంఘాల ఆధ్వర్యంలో చైతన్య భవన్‌లో సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఒక ప్రజాసైన్స్ ఉద్యమ సంస్థగా దేశవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు నవంబర్ నుంచి 2024 ఫిబ్రవరి వరకు దేశవ్యాప్తంగా ప్రచార ఉద్యమం చేపట్టిందన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె హరిహరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ఓటరు చైతన్యం అవసరమని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు అట్ల బాలాజీ రెడ్డి, భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ గురించి వివరించారు. ఊరూరా జన విజ్ఞానం మహిళా కన్వీనర్ ఏ కల్యాణి దేశవ్యాప్త శాస్త్ర ప్రచార ఉద్యమం గురించి వివరించారు. సమావేశంలో జి.రాజారావు, బి.విల్సన్, డి.నిర్మలమ్మ, దాసరి లక్ష్మి, పి.లక్ష్మి, నూరు బాషా, శ్రీనివాస్, ఎస్.కె.సుభాని ఇస్రాయిల్, శరత్ బాబు, వి.ఘంటసాల పాల్గొన్నారు.

నాణ్యమైన దిగుబడులతో లాభాలు

పొలంబడి డీడీఏ బాలునాయక్



పొలంబడిలో రైతులతో మాట్లాడుతున్న డీడీఏ బాలునాయక్

బుద్ధాం(కర్లపాలెం): యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధిస్తే లాభాలు సాధ్యమని పొలంబడి డీడీఏ బాలు నాయక్ తెలిపారు. బుద్ధాం గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులతో పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు. యాజమాన్య పద్ధతుల ద్వారా పండించిన ధాన్యానికి గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తామని దీని ద్వారా మంచి ధరకు విక్రయించుకోవచ్చని పేర్కొన్నారు. పొలంబడి ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వరికి ఆశించే చీడ పీడలను వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి, ఏఓ సుమంత్‌కుమార్, పొలంబడి ఏఓ కిరణ్మయి, గ్రామ వ్యవసాయ సహాయకులు, బాజీ, గోపి, సునీత పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

వై ఏపీ నీడ్స్ జగన్‌లో వక్తలు



మాట్లాడుతున్న గాదె వెంకయ్యబాబు

రేపల్లె రూరల్: పేద ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు అన్నారు. మండలంలోని నల్లూరు నార్త్, నల్లూరు సౌత్ గ్రామాలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికంతో ఎవరూ ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను చూడాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సచివాలయ ఆవరణంలో పంచాయతీ పరిధిలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచి కోనా శ్రీను, ఎంపీటీసీ మేడికొండ సుధాకరచంద్రహాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, ఫణి పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్లు అరెస్టు

కొల్లూరు: కోడి పందేల శిబిరంపై దాడి చేసి పందెం రాయుళ్లను అరెస్టు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. మండలంలోని పెసర్లంక అరవింద వారధికి సమీపంలో పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తనిఖీలు నిర్వహించారు. ఐదుగురితో పాటు, కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లెకోనలో ఎనిమిది మంది..

భట్టిప్రోలు: మండలంలోని పల్లెకోనలో బుధవారం కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.3 వేలు, పది బైకులు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గురువారం నిందితులను రేపల్లె కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ చెప్పారు.